
# శిలా విగ్రహం

మహేష్



## ముగ్గురుమూర్ఖులు

'ఇందిరాగాంధీ' అంటూ చంచ్రలావు వెళ్లే సరికి చిదంబరం చూడామణితో యేదో చెబుతున్నాడు

'ఇందిరాగాంధీ యింత బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు' అని నిరాశను వెలిబుచ్చాడు చిదంబరం

''ఇంతకీ యిప్పుడేమైందని' ప్రశ్నించాడు చంచ్రలావు

''ఏమైందేమిటి ? మొట్టమొదటి ప్రధాన మంత్రి నెహ్రూ 'ఆరాం హరామ్ హై' అనే నినాదాన్ని యిచ్చాడు తరువాత శాస్త్రి అధికారం లోనికి రాగానే 'జై జవాన్ జై కిసాన్' నినాదాన్ని యిచ్చాడు ఇందిరాగాంధీ యింతవరకు తన నినాదాన్ని యివ్వకపోవడం చాలా విచారించవలసిన విషయం 'లూవ్ యాజ్ ది ఓన్లీ హోప్' వంటి యేదో ఒక వినాదాన్ని దేశానికి అందించాలి గాని ప్రధాన మంత్రిణి అయిన తరువాత ఊరుకో కూడదు'' అని సమాధానం యిచ్చాడు చిదంబరం

''అవునవును అటువంటి నినాదంవల్ల చాలా ఉపయోగం కూడా ఉంది ఆమె మురాకు చెందిన వాళ్లంతా ఆ నినాదంతోనే ఒకరినొకరు అభినందించుకోవచ్చును ఆ నినాదాన్ని గట్టిగా అరచేవాళ్లంతా తన మురా వాళ్లేనని నినాదాన్ని యిచ్చిన ఆసామీ గుర్తించడానికి అవకాశం కూడా ఉంది ''

''ఏదైనా పదవిలోనికి రాగానే వెంటనే చేయవలసినవి రెండు పనులు ఉన్నాయి ఒకటి యేదో ఒక నినాదాన్ని గట్టిగా యివ్వడం, రెండవది తన శిలావిగ్రహాన్ని స్థాపించుకోవడం. ఈ రెండింటిలో యేమాత్రం అశ్రద్ధ చూపించినా, అది అధికార దుర్వినియోగమే అవుతుంది'' అని తేల్చేశాడు చూడామణి

''శిలావిగ్రహం అనగానే యీ మధ్యన జరిగిన సంగతి ఒకటి నాకు గుర్తుకు వచ్చింది'' అని అన్నాడు చంచ్రలావు

''ఏమిటా సంగతి ? '' అని చిదంబరం, చూడామణి ఒకేసారి ప్రశ్నించగా చంచ్రలావు చెప్పడం ప్రారంభించాడు

''ఒక ఊళ్లో ముదరయ్య అనే ఆసామీ ఉన్నాడు. అతను యెన్నో సంవత్సరాలు కృషిచేసి చివరకు మున్సిపల్ ఛైర్మన్ కాగలిగాడు వెంటనే ముదరయ్య తన ఆంతరంగికులతో యిలాగ అన్నాడు—

''నేను యెన్నో సంవత్సరాలుగా మీ అందరకు సేవ చేస్తున్నాను ఇప్పుడు మున్సిపల్ ఛైర్మన్‌గా కూడా యెన్నిక అయ్యాను అందుచేత నా శిలా విగ్రహాన్ని స్థాపించకపోవడం మన గ్రామానికే చిన్నతనంగా ఉంది నాయకుల్ని గౌరవించడం మన ఊరికి తెలియదు అనే అపఖ్యాతి కూడా వస్తుంది కాబట్టి మీరందరూ కలిసి నా శిలా విగ్రహాన్ని స్థాపిస్తే బాగా ఉంటుంది'' అని తన కోరికను వెలిబుచ్చాడు ముదరయ్య

ముదరయ్య చెప్పింది చాలా సబబుగా ఉందని అందరూ అంగీకరించారు అయితే దానికి కావలసిన డబ్బు యెక్కడి నుంచి వస్తుందని వారికి సందేహం కలిగింది

దానికి ముదరయ్య యిలాగ అన్నాడు.

''ముందుగా మీరందరూ ముదరయ్య శిలా విగ్రహస్థాపక సంఘంగా యేర్పడి ఊళ్లో చందాలు వసూలు చేయండి నేను యింకా అయిదేళ్లపాటు అధికారంలో ఉంటానని అందరకూ తెలుసును కాబట్టి చందాలు సులువుగానే వసూలు అవుతాయి ఒకానొకవేళ వసూలైన డబ్బు చాలకపోతే యేదో ఒకటి చేయవచ్చును ''

వెంటనే అక్కడ చేరిన, ముదరయ్య శ్రేయస్సును కోరేవారూ, ముదరయ్య ద్వారా తమ శ్రేయస్సును కోరుకొనేవారూ ఒక సంఘంగా యేర్పడ్డారు శిలా విగ్రహాన్ని యెక్కడ స్థాపించడం అనే సందేహం తరువాత వచ్చింది ఒక్కొక్కరు ఒక్కొక్క స్థలాన్ని సూచించారు కాని ఆఖరుకు ఆ ఊళ్లో మూడు సినిమాహాళ్లు ఉన్న నాలుగు రోడ్ల జంక్షనులో శిలా విగ్రహాన్ని నిలబెట్టి దానికి 'ముదరయ్య వెన్యూ' అని పేరు పెట్టడానికి అందరూ అంగీకరించారు

ముదరయ్య శిలావిగ్రహ స్థాపక సంఘం వారు ఒకనాడు చందాలు వసూలు చేయడానికి బయల్దేరారు మొట్టమొదట వారు ఒక సినిమా

హాలు యజమాని వద్దకు వెళ్లారు ఆయనకు తమ ఆశయాన్ని వివరించి, ఉదారంగా చందా యివ్వమని కోరారు

'చందా యివ్వడానికి నాకు యేమీ అభ్యంతరం లేదు మా సినిమాహాలు తరపున నేను రెండువందల రూపాయలు చందా యిస్తాను అయితే దీనికి ఒక షరతు ఉంది మీరు స్థాపించబోయే శిలావిగ్రహం మా సినిమాహాలుకు వెళ్లమని చెబుతున్నట్లుగా చేయి మా హాలు వైపుకు చూపిస్తుండాలి' అని తన షరతును వెల్లడించాడు సినిమాహాలు యజమాని

'సరే మీరు చెప్పిన విషయాన్ని గురించి ఆలోచిస్తామ'ని చెప్పి సంఘ సభ్యులు రెండవ సినిమాహాలు యజమాని వద్దకు వెళ్లారు మొదటి సినిమాహాలు యజమాని విధించిన షరతు సంగతి రెండవ సినిమాహాలు యజమానికి తెలిసింది అందుచేత అతను కూడా అదే షరతు విధించాడు మూడవ సినిమాహాలు యజమాని కూడా అదేమాట అన్నాడు

ఈ షరతులతో శిలావిగ్రహ స్థాపక సంఘం వారికి తల తిరిగిపోయింది

'పోనీ రెండు సినిమాహాళ్ల వైపు రెండు చేతులు చాపినట్లుగా విగ్రహాన్ని పెట్టవచ్చును కాని మూడవ హాలు మా... యెలాగా' అని అన్నాడు ఒక సభ్యుడు

మన ముదరయ్య చిన్నప్పుడు భరతనాట్యం నేర్చు కొన్నాడట గదా! అందుచేత కృష్ణుని కాళీయమర్దన పోజులో కాలు యెత్తి మూడవ సినిమాహాలు వైపు చూపించవచ్చునని సలహా యిచ్చాడు మరో సభ్యుడు

'కాలు సినిమాహాలు వైపు చూపించ కూడదు అలాగ కాలు చూపించితే మా సినిమాహాలుకు వెళ్లినవారిని తంతాననే అర్థం వస్తుంది కాబట్టి మాకు కాలు యెంతమాత్రం పనికిరాదు కుడిచెయ్యే మాకు కావాలి' అని ఖచ్చితంగా చెప్పాడు మూడవ సినిమాహాలు యజమాని

మిగిలిన యిద్దరూ కూడా తమకు కుడిచెయ్యే కావాలన్నారు ఈ పరిస్థితిలో యేమి చేయాలో సంఘం వారికి తెలియలేదు; మనిషికి మూడు కుడిచేతులు యెలాగ వస్తాయి? మూడు యెడం చేతులు కూడా ఉండాలి గదా!

'ఒకానొకవేళ విగ్రహానికి అలాగ ఆరు చేతులు ఉన్నట్లయితే అది త్రినాధస్వామి విగ్రహం అని ప్రజలు అనుకొనే ప్రమాదం ఉంది అందులోనూ మూడు దిక్కులనూ మూడు కుడిచేతులు చూపిస్తుంటే మూడు యెడంచేతుల మాటేమిటి?' అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు మరొక సభ్యుడు

'పోనీ, కుడిచేతిని వేలం వేద్దాం ఆ వేలంలో యే సినిమాహాలు యజమాని యెక్కువ పాట పాడతాడో ఆ హాలువైపే కుడిచేతిని ఉంచుదాం' అని తన సలహాను యిచ్చాడు ...

'అలాగ చేయడంలో ఒక ప్రమాదం ఉంది మనదేశంలో ప్రతి విషయానికి ప్రతిరోజూ ఆందోళన జరుగుతూనే ఉంటుంది అలాంటప్పుడు మిగిలిన సినీమాహాలు యజమానులిద్దరూ యేదో ఒక ఆందోళన సందర్భంలో విగ్రహాన్ని బద్దలు కొట్టించేయడానికి అవకాశం ఉంది అందుచేత అందరకూ యిష్టం అయేటట్లుగానే విగ్రహం ఉండాలిగాని యెవరికీ కష్టాన్ని కలిగించకూడదు' అని స్పష్టంగా అన్నాడు ముదరయ్య

అప్పుడు ముదరయ్య శిలావిగ్రహ స్థాపక సంఘంవారు యీ సమస్యను పరిష్కరించడానికి ఒక ఉపసంఘాన్ని నియమించారు ఆ ఉపసంఘం వారు సినిమాహాలు యజమానులతో సంప్రదించి యీ దిగువ సూచనలను చేశారు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
1968 మే 17
సంచిక నుంచి

1 శిలా విగ్రహానికి రెండు చేతుల మాత్రమే ఉండాలి

2 కుడిచెయ్యిచాపి అటువైపు వెళ్ళమన్నట్లుగా సంజ్ఞ చేస్తుండాలి

3 యెడమ చెయ్యి మామూలుగానే ఉండాలి

4 శిలా విగ్రహాన్ని ఒక వేదికమీద స్థాపించాలి

5 ఆ వేదిక భూమికి అంటుకొని ఉండకూడదు

6 ఆ వేదికను యెటువైపుకు కావలిస్తే ఆటువైపుకు తిప్పడానికి వీలుగా దిగువన చక్రాలు ఉండాలి

7 ఆ వేదికను ఎవరూ తిప్పకుండా భూమికి గొండీలు బిగించి దానికి ఆరు తాళాలు వేయాలి

8 అందులో మూడుతాళాలు మూడు సినిమాహాలు యజమానుల దగ్గర ఉండాలి మిగిలిన మూడు తాళాలు సంఘ సభ్యుల దగ్గర ఉండాలి

9 శిలా విగ్రహం ఒక్కొక్క నెలలో ఒక్కొక్క సినిమాహాలు వైపు చెయ్యి చూపిస్తుండాలి

10 ప్రతినెలా ఫస్టు తారీఖున సినిమాహాలు యజమానులు, సంఘసభ్యులు సమావేశమై తాళాలను తీసి విగ్రహం తాలూకు దిక్కులను మారుస్తుండాలి

11 మొట్ట మొదటి నెల యే సినిమాహాలు వైపుకు చెయ్యి చూపించేదీ లాటరీ ద్వారా తేల్చుకోవాలి

ఈ సూచనలు చాలా బాగున్నాయని ముదరయ్యతో సహా అందరూ అంగీకరించారు ఈ సూచనల ప్రకారమే విగ్రహాన్ని స్థాపించారు ''

'ఇప్పటికే చాలా ఆలస్యమైంద'ని చూడామణి లేవగానే మిగిలిన యిద్దరూ అతన్ని అనుసరించారు ★

